# శతమానం భవతి

"నన్ను మళ్ళీ తిట్టేడు. ఇంక వాడి దగ్గర పని చెయ్యలేను!"

"తొందర పడబోక. ఏమని తిట్టాడూ?"

"వెధవా అని తిట్టేడు. ముండా అని తిట్టేడు. ఇంకా ఇంతకన్నా ఏమని తిట్టాలీ?"

"ఇంతేనా తిడత? ఫరవాలేదు."

"..............................."

"ఫరవాలేదులే! అలా చూడకు."

"అయితే యివన్నీ దులిపేసుకుని వాడిదగ్గరే పని చెయ్యమంటారా?"

"నిక్షేపంలాగ! తిట్టేడన్నమాటేగాని వాడికీ నీకూ మధ్య అంతకన్న ఏం జరిగిందీ, వెళ్ళు: మామూలుగా పనికి వెళ్ళు...."

"అలా వున్నావేం?"

"మళ్ళీ చెడతిట్టాడు పట్టుకుని."

"ఈవేళ ఏమని తిట్టాడూ?"

"గాడిదన్నాడు, చేటపెయ్యన్నాడు, గుడ్లగూబలా చూస్తానన్నాడు."

"ఇన్నిమాటలూ అన్నాడా?" "ఇంతకన్న ఎక్కువే అన్నాడు."

"అన్నాడు గదా! అయితే ఫరవాలేదు." "..................."

"ఫరవాలేదోయి. మామూలుగా పనికి వెళ్ళిపో రేపు."

"ఇన్ని తిట్లూ తినా?"

"వెళ్ళు. మరేం ఫరవాలేదు, వెళ్లు. అలా చూడక."

"ఇంక వాడివద్ద పనిచేస్తే...." "ఏం. ఏం?"

"చడతిట్టాడు పట్టుకుని."

"ఈవేళానా?" రోజూకన్న ఎక్కువగా!"

"రోజూకన్న ఎక్కువగా తిట్టాడా?"

"ఓ! వీపు వాచిపోయేట్టు తిట్టేడు."

"అయితే ఇంక ఫరవాలేదు."

"ఏమిటి ఫరవాలేదు, మీ మొహం?"

"నీకే తెలుస్తుందిలే—"

"ఇంకా వాడిదగ్గరకు పనికి వెళ్ళమంటారా?"

"ఇదే అసలు నువ్వు వాడిదగ్గర నుంచి వృద్ధిలోకి రావలసినవిషయం—"

"......................."

"ఇంకొంచెం నేర్పుగా ప్రవర్తించావంటే—"

"ఛా! ఇంక నేర్పూలేదు, ఓర్పూలేదు. ఈవేళతో రాజీనామా...."

"వొద్దు వొద్దు. చెడిపోతావు, వృద్ధిలోకి వస్తూన్నవాడివి...."

యం. యస్. మూర్తి




"ఏమిటి వృద్ధీ—తిట్లూ, శాపనార్థాలూనా?"

"వాటి అర్థం నీకు తెలీదు. కొద్ది కాలంలోనే తెలుస్తుందిలే రేపు మాత్రం పనికి వెళ్లాలి సుమా! మానేశావు గనక, నా సలహా విని ఎవడూ పాడుకాలేదు—''

"ఈవేళటివరకూ మీ సలహా పాటించాను. ఇంక నన్ను మొహమాటి పెట్టకండి—''

"ఏం? ఈవేళ ఏం జరిగిందేమిటీ?''

"నూరు తిట్లు తిట్టేడు, పేలేపి?''

"లెక్కపెట్టేవా? సరిగ్గా నూరూ తిట్టాడా?''

తిట్టేడు—''

"ఇక నిన్ను విడవడు. నీకింక నిరుద్యోగసమస్య వదలిపోయింది—''

"మీమాటలు నాకు అర్థం కావడం లేదు''

"ఇంక నువ్వు వాడిదగ్గర స్థిరపడ్డావన్నమాట—''

"మీకు మతిపోయిందా? అలా పట్టుకు తిడుతూంటే వాడు నన్ను . .''

నీకింకా తెలిసి రావడంలేదు వాడి తత్వం. నువ్వు చవటపెయ్యమ్మవయితే మొట్ట మొదటిరోజునే ఒక్కతిట్టు తిట్టకుండానే అవతలకు పంపించేసి వుండేవాడు—''

"మరి ఈ తిట్లూ?''

"నూరువరకూ భరించగలిగే సమర్థత నీలో వుందో లేదో అతడు పరీక్షించేడు''

"ఏమి వింత మాటలు!''

"నూరువరకు భరించావు—పరీక్ష ప్యాసయ్యావు—ఇంక నిన్ను విడవడు!''